సాక్షి
కుమురం భీం
శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023

గుట్టలెక్కి.. ఓటు వేసి

జైనూర్(ఆసిఫాబాద్): ఏజెన్సీ ప్రాంత ఓటర్లకు ఓటు వేసేందుకు తిప్పలు తప్పలేదు. జైనూర్ మండలం దబోలి గ్రామ పంచాయతీ పరిధిలోని లొద్దిగూడలో 63 మంది ఓటర్లు ఉన్నారు. లొద్దిగూడ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఏడు కిలోమీటర్ల దూరంలోని పంచాయతీ కేంద్రం దబోలిలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పడే ప్రభుత్వం తమ బాధలు తీరుస్తుందనే నమ్మకంతో కాలినడకన వెళ్లి ఓటు వేసినట్లు గ్రామస్తులు తెలిపారు.



ఓపిగ్గా ఓటు వేశారు

- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- పొద్దుపోయే వరకూ కొనసాగిన పోలింగ్
- కొన్ని మండలాల్లో రాత్రి 8 గంటల తర్వాత కూడా క్యూలైన్లలో ఓటర్లు
- సౌకర్యాలు లేక ఇబ్బందులు
- జిల్లాలో ఐదు గంటల వరకు 71.63 శాతం పోలింగ్ నమోదు



చింతలమానెపల్లి: రవీంద్రనగర్‌లో గుర్తింపు కార్డులతో మహిళా ఓటర్లు



జిల్లా కేంద్రంలో ఓటు వేసిన యువతులు

సాక్షి, ఆసిఫాబాద్/సాక్షి నెట్‌వర్క్: అక్కడక్కడా ఈవీఎంల మొరాయింపులు.. కాగజ్‌నగర్‌లో రాజకీయ పార్టీల హంగామా.. అభ్యర్థుల్లో ముఖాల్లో ఆందోళన.. ఓట్ల చీలిక భయం.. ఇలా గురువారం జిల్లాలో జరిగిన శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సిర్పూర్, ఆసిఫాబాద్ స్థానాలకు పోటీ చేసిన 30 మంది అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంల్లో నిక్షిప్తమైంది. జిల్లావ్యాప్తంగా 3.24 లక్షల మందికి పైగా ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు యువత ఆసక్తి కనబరిచింది. మావోయిస్టు ప్రభావిత జాబితాలో కుమురం భీం జిల్లా ఉండడంతో ఇక్కడ సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగిసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సిర్పూర్, ఆసిఫాబాద్ స్థానాల్లో జిల్లా అధికారులు ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ నిర్వహించారు. సాయంత్రం 4 గంటల వరకు క్యూలో ఉన్నవారికి ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడంతో పలు మండలాల్లో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.



జిల్లాలో పోలింగ్ తీరు (శాతంలో)

71.63 శాతం పోలింగ్..

అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు గంటలకు వెల్లడించిన వివరాల ప్రకారం జిల్లావ్యాప్తంగా 71.63 శాతం పోలింగ్ నమోదైంది. గంటల వరకు సిర్పూర్‌లో 71.18 శాతం, ఆసిఫాబాద్‌లో 72.08 శాతం పోలింగ్ నమోదు కాగా మొత్తంగా 3.24 లక్షల మందికి పైగా ఓటు వేశారు.

పోలింగ్ కోసం 599 కేంద్రాలు..

సిర్పూర్, ఆసిఫాబాద్ శాసనసభ స్థానాలకు గురువారం జరిగిన ఎన్నికలు చెదురుముదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ వంటి ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను బరిలో నిలిపాయి. పలువురు స్వతంత్ర అభ్యర్థులు కూడా తమ భవితవ్యాన్ని పరీక్షించుకున్నారు. జిల్లాలో 4.53 లక్షలకుపైగా ఓటర్లుండగా.. వీరంతా ఓట్లు వేయడానికి వీలుగా 599 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఈవీఎంల మొరాయింపు..

ఉదయం ఏడు గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. అయితే ఉత్సాహంగా వచ్చిన ఓటర్లకు కొన్నిచోట్ల ఈవీఎంలు చుక్కలు చూపించాయి. వాంకిడి మండలం ఖమాన గ్రామంలోని పోలింగ్ కేంద్రం నం.237లోని ఈవీఎం ఉదయం అరగంటపాటు, కాగజ్‌నగర్ పట్టణంలో ద్వారక నగర్‌లోని శిశుమందిర్ పాఠశాలలో పోలింగ్ బూత్ నం.63లోని ఈవీఎం గంటకుపైగా మొరాయించడంతో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తాయి. కాగజ్‌నగర్ రూరల్ ప్రాంతంలోని భట్టుపల్లి, ఈజ్‌గాం గ్రామాల్లోనూ ఈవీఎంలు మొరాయించాయి. సాంకేతిక నిపుణులు వాటి స్థానంలో మరొకటి ఏర్పాటు చేశారు. అలాగే కోసిని, రాస్పల్లి పోలింగ్ బూత్‌లో విద్యుత్ సౌకర్యం సరిగా లేక ఓటింగ్ ఆలస్యంగా నడిచింది. చీకట్లో గుర్తులు కనిపించక ఇబ్బందులు పడ్డామని ఓటర్లు వాపోయారు. అలాగే అక్కడ ర్యాంప్ ఏర్పాటు చేయకపోవడంతో వృద్ధులు ఓటేసేందుకు ఇబ్బందులు పడ్డారు. వారిని ఎత్తుకెళ్లి ఓట్లు వేయించాల్సిన పరిస్థితి వచ్చింది. రెబ్బెన మండలం నంబాలలోని 288 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో గంట ఆలస్యంగా ఓటింగ్ మొదలైంది. కొండపల్లి, గోలేటిలోని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 7 వరకు ఓటింగ్ కొనసాగింది. నంబాలలోని 288 పోలింగ్ కేంద్రంలో నిర్ణీత సమయానికి చేరుకున్న కొంత మంది ఓటర్లను ఎన్నికల సిబ్బంది ఓటు వేసేందుకు అనుమతించలేదని సర్పంచ్ చెన్నసోమశేఖర్ కలెక్టర్ హేమంత్ బోర్కడేకు ఫిర్యాదు చేశారు. ఆదివాసీ ఓటర్లు మరో పోలింగ్ కేంద్రానికి వెళ్లడంతో 5నిమిషాలు ఆలస్యమైందని ఆయన తెలిపారు. సిర్పూర్(టి)లోని 126, 127, 128 కేంద్రాల్లో ఓటర్లు గంటల తరబడి వేచిచూశారు.

కాగజ్‌నగర్‌లో ఘర్షణ...

సిర్పూర్ నియోజకవర్గం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం చౌరస్తా సమీపంలో ఉన్న బాలికల ఉన్నత పాఠశాలలోని నం.90 పోలింగ్ కేంద్రం వద్ద బీఆర్‌ఎస్, బీఎస్పీ నేతలు ఘర్షణకు దిగారు. బీఆర్‌ఎస్ నేతలను పోలింగ్ బూత్‌లోకి వెళ్లనిస్తున్నారని బీఎస్పీ నేతల ఆరోపణలతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఇరువర్గాలు రాళ్లు, చెప్పులు రువ్వుకోవడంతో పోలీసులు లాఠీచార్జీ చేశారు. ఈ ఘర్షణలో కరీంనగర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు, పట్టణ ఎస్‌ఐ గంగన్న, మరికొంత మంది సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి.

అంచనాల్లో తలమునకలు...

శాసనసభ ఎన్నికల జాతర ముగిసింది. ఇక ఫలితాలపై అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటి వరకు సాగిన పోరులో ఫలితాలపై అభ్యర్థులు ఆశల పల్లకిలో ఊగిసలాడుతున్నారు. విజయావకాశాలపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తుండగా లోలోన ఆందోళన కూడా అంతేస్థాయిలో ఉంది. జిల్లాలో రెండు నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించగా ఆసిఫాబాద్‌లో 17 మంది, సిర్పూర్‌లో 13 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. ప్రస్తుతం వీరంతా ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. గురువారం సాయంత్రానికి పోలింగ్ ప్రక్రియ ముగియడంతో అందరి దృష్టి ఫలితాలపైకి మళ్లింది. జిల్లా అంతటా ఫలితాలపైనే ఆసక్తికర చర్చ కొనసాగుతోంది. ఎవరు గెలుస్తారనే చర్చలు గ్రామాలు, పట్టణాల్లో జోరుగా సాగుతున్నాయి. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థుల విజయావకాశాలపై చర్చలు ఊపందుకున్నాయి. ఎన్నికల ఫలితాలపై అభ్యర్థులతోపాటు సంబంధిత పార్టీల నాయకుల్లోనూ ఉత్కంఠ కొనసాగుతోంది. ఫలితాల ఉత్కంఠకు తెర పడేందుకు మూడు రోజులు నిరీక్షించక తప్పదు.

ఓటేసిన 'గుండి'

ఆసిఫాబాద్‌రూరల్: వంతెన పూర్తయ్యే వరకు ఎన్నికలు బహిష్కరిస్తామని ప్రకటించిన మండలంలోని గుండి గ్రామస్తులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ప్రచారానికి సైతం రానీయకుండా అభ్యర్థులను అడ్డుకున్న విషయం తెలిసిందే. గ్రామంలో బీజేపీ అభ్యర్థి ప్రచార వాహనంపై గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేయడంతో ఉద్రిక్తత నెలకొంది. అయితే ప్రచారం చివరి నాటికి అభ్యర్థులు ఇచ్చిన స్పష్టమైన హామీలతో ఓటింగ్‌కు ముందుకు వచ్చారు. గ్రామంలో మొత్తం 1,800 మంది ఓటర్లు ఉండగా 1,560 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.



'ఓటు' వినియోగించుకున్న కలెక్టర్ దంపతులు



సిరా గుర్తు చూపుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే దంపతులు

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ హైస్కూల్‌లోని 198 పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఆయన సతీమణి రేవతి ఓటుహక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద వరుసలో నిలబడి సాధారణ పౌరులతో కలిసి ఓటు వేశారు.

దివ్యాంగులకు ప్రత్యేక పోలింగ్ కేంద్రం



ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఏకైక దివ్యాంగుల పోలింగ్ కేంద్రం మోతుగూడ గ్రామంలో ఏర్పాటు చేశారు. ఇక్కడ విధులు పూర్తిగా దివ్యాంగులే నిర్వర్తించారు. ఈ కేంద్రం పరిధిలో 923 ఓటర్లకు 824 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎస్పీ



కాగజ్‌నగర్ పట్టణంలోని పోలింగ్ కేంద్రం వద్ద ఎస్పీ సురేశ్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమా స్కూల్, బాలభారతి స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను గురువారం ఎస్పీ సురేశ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు సందర్శిస్తూ పోలింగ్ ప్రక్రియను నిశితంగా పరిశీలించామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన భద్రత ఏర్పాట్లతో పోలింగ్ నిర్వహణ జరిగిందన్నారు.

కెరమెరి(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని 100, 101 పోలింగ్ కేంద్రాలను గురువారం ఎస్పీ సురేశ్‌కుమార్ పరిశీలించారు. పోలింగ్ సరళి, భద్రతా చర్యల గురించి ఎస్సై విజయ్‌ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి సూచనలు చేశారు.

ఆసిఫాబాద్‌లో చాలెంజ్ ఓటు



విలేకరులతో మాట్లాడుతున్న నాగమణి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలికల పాఠశాల పోలింగ్ కేంద్రంలో పట్టణానికి చెందిన నాగమణి ఓటు వేసేందుకు రాగా, అప్పటికే తన ఓటు మరో మహిళ వేసినట్లు గుర్తించారు. దీంతో విస్మయానికి గురైన ఆమె ఎన్నికల సిబ్బందిని నిలదీసింది. ఎన్నికల అధికారులు చాలెంజ్ ఓటు వేసే అవకాశం కల్పించగా.. ఆమె తన ఓటు హక్కు వినియోగించుకుంది.

తొలి ఓటరు స్ఫూర్తి..



ఆత్రం రంభాబాయి

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం చిన్నమాలిని గ్రామానికి చెందిన రాష్ట్ర తొలి ఓటరు ఆత్రం రంభాబాయి మాలిని గ్రామంలోని పోలింగ్ కేంద్రం నం.1లో గురువారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాజ్యాంగం ప్రసాదించిన ఓటుహక్కును వినియోగించుకోవడం గర్వంగా ఉందని ఆమె తెలిపారు.

ట్రాన్స్‌జెండర్‌కు సన్మానం



దివ్యశ్రీని సన్మానిస్తున్న అధికారులు

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండల కేంద్రానికి చెందిన ట్రాన్స్‌జెండర్ దివ్యశ్రీ గురువారం తన ఓటుహక్కును పోలింగ్ కేంద్రం నం.252లో వినియోగించుకున్నారు. బాధ్యతగా ఓటు వేసిన దివ్యశ్రీని తహసీల్దార్ రహీముద్దీన్, సెక్టోరియల్ అధికారి కృష్ణ తదితరులు శాలువాతో సన్మానించారు.

ఆదర్శం.. జాకీర్ పాషా



కాలితో సంతకం చేస్తున్న జాకీర్ పాషా

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఫారెస్ట్ డివిజన్ ఆఫీసులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో రెండు చేతులు లేని దివ్యాంగుడు జాకీర్ పాషా ఓటు వేసి ఆదర్శంగా నిలిచాడు. కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పాషా కాలి సాయంతోనే సంతకం చేసిన అనంతరం ఓటు వేశాడు. కాగా జాకీర్ పాషా కాలి సహాయంతోనే పెయింట్‌లు వేయడంతో పాటు రోజువారీ పనులు చేసుకుంటున్నాడు.



సిర్పూర్(టి): ఓటింగ్ కోసం వేచి చూస్తున్న మహిళలు



బెజ్జూర్: రాత్రి పూట కొనసాగుతున్న పోలింగ్



చింతలమానెపల్లి: వీల్‌చైర్‌తో వృద్ధుడికి సాయం



దహెగాం: లగ్గాంలో ఓటు వేసేందుకు ఎడ్లబండిపై వస్తున్న రైతులు

పోలింగ్ తీరు పరిశీలన

ఆసిఫాబాద్: కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం నుంచి కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్ కుమార్ వెబ్ కాస్టింగ్, సీసీటీవీల ద్వారా పోలింగ్ తీరును పరిశీలించారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి తరలించగా, అక్కడి నుంచి పట్టణంలోని సాంఘిక సంక్షేమ పాఠశాలలోని స్ట్రాంగ్ రూంకు తరలించారు. కాగా.. జిల్లా కేంద్రంలో 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జన్కాపూర్‌లో ఆదర్శ పోలింగ్ కేంద్రం, జెడ్పీ హైస్కూల్‌లో మహిళా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటల తర్వాత కేంద్రాలకు వచ్చిన వారిని లోనికి అనుమతించలేదు. దస్నాపూర్‌కు చెందిన పలువురు ఆలస్యంగా రాగా ఓటు వేసేందుకు అధికారులు నిరాకరించడంతో వెనుతిరిగారు. ఉర్దూ మీడియం పాఠశాలలోని 193, 194 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగింది. కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్ కుమార్, డీఎస్పీ వెంకటరమణ పోలింగ్ కేంద్రాలు సందర్శించారు.



కంట్రోల్‌రూంలో వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్

కాయ్ రాజా కాయ్!

- ఫలితాలపై బెట్టింగులు మరూ

సాక్షి, ఆసిఫాబాద్: ఎన్నికలు ముగియడంతో అభ్యర్థులంతా ఓట్ల కూడికలు తీసివేతల్లో మునిగిపోయారు. మరోపక్క గెలుపు ఎవరిదనే దానిపై బెట్టింగులు మొదలయ్యాయి. జిల్లాలోని రెండు నియోజకవర్గాలోనూ ఇవి కొనసాగుతుండడం ఉత్కంఠను రేకెత్తిస్తోంది. తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించామని బీఆర్‌ఎస్, మార్పు కోసం ముందడుగేద్దాం.. తెలంగాణ ఇచ్చి పార్టీని గెలిపిద్దామని కాంగ్రెస్, ఒక్క అవకాశం ఇవ్వండి.. తెలంగాణ అభివృద్ధి మాతోనే సాధ్యమని బీజేపీ.. ఇలా ఎవరికి వారు ఓటర్లను ఆకర్షించేందుకు ప్రసంగాలు చేయడం.. మేనిఫెస్టోలో ఓటర్లను ఆకర్షించేలా హామీలు ఉండడంతో అన్నిపార్టీలు గట్టిపోటీనిచ్చాయి. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య, సిర్పూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య తీవ్ర పోటీ నెలకొన్నట్లు ఎగ్జిట్‌పోల్స్ పేర్కొంటున్నాయి. అయితే గెలుపు ఓటములు డిసెంబర్ 3న తేలనున్నాయి. ఆదివారం ఓట్ల లెక్కింపు ఉండడంతో ఇప్పటి నుంచే ఎవరు గెలుస్తారనేదానిపై చర్చ జోరందుకుంది. గెలుపు ఒకవైపు కాకుండా హోరాహోరీగా జరిగిందని పేర్కొంటూ బెట్టింగులు పెడుతున్నారు. దీంతో ఎన్నికలు ముగిసినా ఆ వేడి ఇంకా తగ్గనట్లు కనిపిస్తోంది. ఆసిఫాబాద్‌లో బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసిన కోవ లక్ష్మి గెలుపొందుతారని కొందరు, కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యాం నాయక్ విజయం సాధిస్తారని ఇంకొందరు బెట్టింగులు కాశారు. రూ.5 వేల నుంచి రూ.లక్ష వరకు పందెం పెట్టినట్లు తెలిసింది. సిర్పూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, బీజేపీ, బీఎస్పీ ఇలా ముగ్గురు అభ్యర్థుల విజయం మీద బెట్టింగ్ సాగుతున్నాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప భారీ మెజార్టీతో గెలుపొందుతారని కొందరు, బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు గెలుపొందుతారని మరికొందరు రూ.లక్షల్లోనే బెట్టింగులు పెట్టినట్లు సమాచారం. ఓట్లు చీలిక ఏర్పడి బీఎస్పీ అభ్యర్థి గెలుపొందుతారని ఇంకొందరు పందెం కాసినట్లు ప్రచారం జరుగుతోంది. క్రికెట్ బెట్టింగులు నిర్వహించే కొందరు వీటిని ప్రోత్సహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక చిన్నాచితక బెట్టింగులకైతే లెక్కే లేదు. రెండ్రోజుల్లో ఇది మరింత పుంజుకోనుందని తెలుస్తోంది.

క్లుప్తంగా

ఓటేసిన శతాధిక వృద్ధురాలు


ఓటేసి వస్తున్న రుఖియా బేగం

కెరమెరి: మండలంలోని ధనోరా గ్రామానికి చెందిన 103 ఏళ్ల వృద్ధురాలు రుఖియా బేగం గురువారం ధనోరా పోలింగ్ కేంద్రంలో తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. కెరమెరి వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం వృద్ధురాలిని స్వయంగా పోలింగ్ కేంద్రానికి తీసుకవచ్చి ఓటు వేయించారు. ఓటు వేయడం తన హక్కుగా భావిస్తున్నానని, బతికున్నంతకాలం ఓటు వేస్తానని, ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు.

సరిహద్దు పల్లెల్లో 80.02 శాతం పోలింగ్


భోలాపటార్‌లో క్యూలో ఓటర్లు

కెరమెరి(ఆసిఫాబాద్): తెలంగాణ– మహారాష్ట్ర సరిహద్దులోని 14 వివాదాస్పద గ్రామాల ఓటర్లు గురువారం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలోని అంతాపూర్, పరందోళి, భోలాపటార్ పంచాయతీల్లోని 14 గ్రామాల్లో 3,383 మంది ఓటర్లు ఉండగా 2,706 మంది ఓటు వేశారు. మొత్తంగా 80.02 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. లెండిగూడ నుంచి సుమారు 4 కిలోమీటర్లు, ఎసాపూర్ నుంచి 5 కిలోమీటర్ల దూరం నడిచి భోలాపటార్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. ఉదయం 10 గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగినా ఆ తర్వాత పుంజుకుంది. తెలంగాణ, మహారాష్ట్ర పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వాగులో పడి వృద్ధురాలి మృతి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ గ్రామానికి చెందిన జంగిలి లక్ష్మీబాయి (75) వాగులో పడి బుధవారం మృతి చెందినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..యాపల్‌గూడకు చెందిన లక్ష్మీబాయి మతిస్థిమితం కోల్పోయింది. ఇదే క్రమంలో ఆమె గ్రామ శివారు ప్రాంతంలో తిరుగుతూ వెళ్తున్న క్రమంలో ఆకస్మాత్తుగా వాగులో పడి మృతిచెందింది. గురువారం మృత్యురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం


మంటలు ఆర్పుతున్న కుటుంబ సభ్యులు

తానూరు: మండలంలోని భోసి గ్రామానికి చెందిన సబ్బన్ సాయినాథ్ ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి పంట షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు బాధిత రైతు వాపోయాడు. రైతు సాయినాథ్ ఏరిన పత్తిని ఇంటి ఎదుట నిల్వ చేసుకున్నాడు. గురువారం మధ్యాహ్నం విద్యుత్ తీగలకు షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి పత్తికి మంటలు వ్యాపించాయి. గమనించిన కుటుంబీకులు, గ్రామస్తులు మంటలు ఆర్పేలోగా సుమారుగా రెండు క్వింటాళ్ల పత్తి దగ్ధమైనట్లు బాధిత రైతు తెలిపాడు.


కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రవీణ్ కుమార్


కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప, కుటుంబ సభ్యులు


కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్


మంచిర్యాలటౌన్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు, కుటుంబ సభ్యులు


రామకృష్ణాపూర్: క్యాతనపల్లిలో ఓటుహక్కు వినియోగించుకున్నచెన్నూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ దంపతులు


కోటపల్లి : దేవులవాడలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు బారులు తీరిన జనం


మంచిర్యాలటౌన్: మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, కుటుంబ సభ్యులు


తిర్యాణి: ఓటు హక్కు వినియోగించుకున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు దంపతులు


ఓటేసిన అభ్యర్థులు

- ఎమ్మెల్యే ఆత్రం సక్కు తన స్వగ్రామం లక్మీపూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- బీఆర్‌ఎస్ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి మందగూడ పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు.
- బీజేపీ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా ఆత్మారాం నాయక్ గోలేటి టౌన్‌షిప్‌లో ఓటుహక్కు వినియోగించుకున్నారు.
- కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా శ్యాం నాయక్ జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు.
- మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఓటుహక్కు వినియోగించుకున్నారు.
- మంచిర్యాల బీఆర్‌ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు జిల్లా కేంద్రంలోని ఆర్‌బీహెచ్‌వీ పాఠశాలలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు.
- మంచిర్యాల బీజేపీ పార్టీ అభ్యర్థి వెరబెల్లి రఘునాథ్ జిల్లా కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో తన తల్లి రాజ్యలక్ష్మితో కలిసి ఓటు వేశారు.
- చెన్నూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బాల్క సుమన్ దంపతులు క్యాతనపల్లిలో ఓటుహక్కు వినియోగించుకున్నారు.
- చెన్నూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి ఓటుహక్కు వినియోగించుకున్నారు.
- చెన్నూర్ బీజేపీ పార్టీ అభ్యర్థి దుర్గం అశోక్ తన భార్య అరుణతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు.
- సిర్పూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ స్కూల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు.
- సిర్పూర్ బీఎస్పీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫాతిమా కాన్వెంట్ స్కూల్‌లో ఓటుహక్కు వినియోగించుకున్నారు.
- సిర్పూర్ కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్ దంపతులు పట్టణంలోని శిశుమందిర్ పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు.
- బీఆర్‌ఎస్ బెల్లంపల్లి అభ్యర్థి, ఎమ్మెల్యే చిన్నయ్య నెన్నెల మండలం జెండా వెంకటాపూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు.
- బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమురాజుల శ్రీదేవి బెల్లంపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు.
- సిర్పూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీష్‌బాబు బెజ్జూర్ మండలం రెబ్బెనలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.


మంచిర్యాలటౌన్ : చెన్నూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వివేక్


మంచిర్యాలటౌన్: బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘునాథ్, తల్లి రాజ్యలక్ష్మి


తిర్యాణి: ఆసిఫాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి


రెబ్బెన: ఆసిఫాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆత్మారాం నాయక్


ఆసిఫాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్


మందమర్రిరూరల్ : చెన్నూర్ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్


రామకృష్ణాపూర్: ఆర్‌కేపీలో కరీంనగర్ సివిల్ జడ్జి ప్రీతి


కోటపల్లి : సిర్సాలో సమయం ముగిశాక ఓటు కోసం కిక్కిరిసిన జనం


నెన్నెల: బెల్లంపల్లి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య కుటుంబ సభ్యులు


వేమనపల్లి : ఓటు వేసేందుకు దివ్యాంగుడిని బైక్‌పై తీసుకువస్తున్న సహాయకుడు


బెల్లంపల్లి: బీజేపీ అభ్యర్థి అమురాజుల శ్రీదేవి


బెజ్జూర్: హరీష్ బాబు

ఓటుకు వెళ్తే.. చనిపోయావన్నారు

- ఓటు వేసేందుకు నిరాకరించిన అధికారులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు

కౌటాల: మండలంలోని గుడ్లబోరి గ్రామానికి చెందిన హివార్కర్ భాస్కర్ ఓటుహక్కు వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్తే మరణించినట్లుగా ధ్రువీకరించిన ఘటన చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గుడ్లబోరి గ్రామానికి చెందిన హివర్కర్ భాస్కర్ గురువారం ఉదయం అధికారులు అందించిన పోల్‌చీటీతో ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లాడు. అధికారుల వద్ద ఉన్న ఓటరు లిస్టులో సదరు వ్యక్తి చనిపోయినట్లుగా ఉండడంతో ఓటు వేసేందుకు అనుమతి ఇవ్వలేదు. దీంతో తాను బతికుండగానే చనిపోయినట్లుగా ఎవరు ధ్రువీకరించారని భాస్కర్ అధికారులతో వాగ్వివాదానికి దిగాడు. ఏజెంట్లు ఓటు వేయడానికి అనుమతి ఇవ్వాలని కోరినప్పటికీ ఎన్నికల కమిషన్ పంపిన జాబితాలో చనిపోయినట్లుగా ధ్రువీకరించారని, ఓటు వేస్తే తామే బాధ్యులమవుతామని నచ్చజెప్పి తిరిగి పంపించారు.


పోల్ చీటీతో పోలింగ్ కేంద్రం వద్ద భాస్కర్

దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

కోల్‌బెల్ట్‌లో ప్రశాంతంగా ఎన్నికలు

- ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్న యువ కార్మికులు
- పోల్ చీటీలు అందక పలుచోట్ల ఓటర్ల ఇబ్బందులు

శ్రీరాంపూర్: కోల్‌బెల్ట్ ఏరియా శ్రీరాంపూర్‌లో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సింగరేణి కార్మిక కుటుంబాలు అధికంగా ఉన్న శ్రీరాంపూర్‌లో ఉదయం నుంచే ఓటర్లు ఓటు వేయడానికి బారులు తీరారు. పోలింగ్ సందర్భంగా సింగరేణి ఉద్యోగులకు కంపెనీ వేతనంతో కూడిన సెలవు ఇవ్వడంతో గురువారం ఉద్యోగులు ఇంటి వద్దే ఉండి కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రభుత్వ ఐటీఐ, సింగరేణి సీఈఆర్ క్లబ్, సన్ స్టార్ స్కూల్, శారద శిశుమందిర్, సాక్షర భారత్ (శ్రీలక్ష్మీ శిశుమందిర్), కేరళ మోడల్ స్కూల్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఆర్కే 6 కాలనీ), తాళ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పెద్దఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి. పోల్ చీటీలు సక్రమంగా పంపిణీ చేయకపోవడంతో ఓటర్లు పోలింగ్ బూత్‌లను వెతుక్కోవడానికి ఇబ్బంది పడ్డారు.


శ్రీరాంపూర్‌లో క్యూలో ఉన్న ఓటర్లు

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ప్రేంసాగర్‌రావు

శ్రీరాంపూర్‌లోని పలు పోలింగ్ కేంద్రాలను మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆయా పోలింగ్ బూతుల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని వివరించారు. పోలింగ్ కేంద్రాల బయట ఓటర్లకు అభివాదం చేశారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చూడాలని పార్టీ నేతలకు సూచించారు.

పోల్ చీటీలు ఇవ్వలేదు



నేను ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటాను. ఇక్కడ మార్టిన్ గ్రామర్ స్కూల్‌లో ఓటు వేయాలన్నారు. మా వాడలో అందరు ఇక్కడే ఓటేశారు. నేను వచ్చి ఓటరు కార్డు చూపిస్తే ఇక్కడ ఓటు దొరకడం లేదంటున్నారు. పోల్ చీటీ కావాలంటున్నారు. బీఎల్‌వోలు నాకు పోల్ చీటీలు ఇవ్వలేదు. – పీ.ఓదెలు

పోలింగ్ వేళ చిత్రాలు !

- ఓటుకు నోటు అన్నట్లుగా వ్యవహారం
- డబ్బులు డిమాండ్ చేసిన కొందరు ఓటర్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల వేళ కొందరు ఓటు వేసేందుకు డబ్బు వసూలు చేయడం చాలా గమ్మత్తుగా కనిపించింది. గతంలో కంటే ఈసారి మరింత ఎక్కువగా నోట్ల కోసం నేరుగా పార్టీ నాయకులను అడుగుతున్నారు. నోటు ఇవ్వకపోతే ఓటెయ్యమని డిమాండ్ చేయడం వినిపించింది. మరికొందరైతే పోటీలో ఉన్న ప్రతీ అభ్యర్థి నుంచి ఎంతో కొంత రాబట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపించింది. వలస, స్థానిక ఓటర్లు ఎంతో మంది తమ ఊరి నాయకుల నుంచి వసూలు చేశారు.. ఇదే అదునుగా అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేసి మధ్యలో చేతివాటం చూపించిన నాయకులూ ఉన్నారు. ఉప ఎన్నికల సమయంలో భారీగా డబ్బు, మద్యం పంపిణీ చేశారు. ఈసారి ఆ స్థాయిలో లేక కొందరు నిరాశపడ్డారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఓటుకు రూ.500 దాటక పోవడంపై చర్చ జరిగింది. గురువారం పోలింగ్ సందర్భంగా పలుచోట్ల కొందరి స్పందనలు ఇలా..

వాళ్లు ఇచ్చే ఐదొందలు వారి మొఖనా కొట్టు. హైదరాబాద్ నుంచి వస్తే గిదేనా? మొన్నటి సారి ఎన్నికల్ల ఎంతిచ్చారు? ఇప్పుడెంతిస్తున్నారు. ఈ పైసలు తీసుకుని నేనెందుకు బద్నాం కావాలే. నాకు నచ్చినవాళ్లకు ఏస్తా. – హైదరాబాద్ నుంచి హుజూరాబాద్ నియోజకర్గానికి వచ్చిన ఓ ఓటరు

ఆ పార్టీ ఆయన ఏం ఇవ్వలే. ఈయన ఐదువందలు. ఇంకో ఆయన వెయ్యి ఇస్తున్నడట. సాయంత్రం దాక చూస్తా. ఇంకా ఏమన్న ఇస్తారో చూసి ఓటు వేస్తా. – మంచిర్యాల నియోజకవర్గంలో ఓ ఓటరు తీరిది

ఇప్పుడే ఓటేస్తే ఏముంటది? కాసేపు చూసి ఎటు నడుస్తుందో తెలుసుకుని వేస్తా. ఒకరి డబ్బులే వచ్చాయి. మరో ఇద్దరివి కూడా అడిగి చివరికి వేస్తా. – మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో ఓ ఓటరు

మేం నలుగురం ఉన్నాం. ఎంతిస్తవో చెప్పు. పోయిన సారి మీకే ఏసిన. ఇప్పుడు కూడా మీకే. మమ్మల్ని చూసుకోవాలి. – హైదరాబాద్ నుంచే బేరమాడుతున్న ఓటరు

ట్రైన్ దిగి నేరుగా పోలింగ్ కేంద్రానికి పోతే డిమాండ్ ఉండదు. ఇంటికి పోయి ఊళ్లో లీడర్లను కలసి మాట్లాడాలి. ఏం సంగతి ఏం లేదా? అని అడగాలి. ఓ సీసా, ఇంకా ఏమన్నా తీసుకోవాలి. – హైదరాబాద్ నుంచి పెద్దపల్లికి ట్రైన్‌లో వస్తున్న మరో ఓటరు ముచ్చట ఇది

ముంబయి నుంచి వచ్చా



నస్పూర్ నా స్వస్థలం. వృత్తి రీత్యా ముంబయిలో ఉంటున్నా. ఐదేళ్ల కోసారి వచ్చే ఈ ఎన్నికలు మన భవిష్యత్‌ను నిర్దేశిస్తాయి. ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనది. అందుకే ఎంత కష్ట, నష్టమైనా అంతదూరం నుంచి వచ్చి ఓటు వేశా. – రేగళ్ల వెంకట్, ప్రముఖ స్పోర్ట్స్ ఎనలసిస్ట్, ముంబయి

కొత్త అనుభూతి వచ్చింది



పాతమంచిర్యాల: నాపేరు అజయ్, జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లో నివాసం ఉంటున్నా. ఈసారే నాకు కొత్తగా ఓటుహక్కు వచ్చింది. అంతకు ముందు ఓటు ఎలా వేయాలో తెలుసుకోవాలని కుతూహలంగా ఉండేది. ఆండాళమ్మ కాలనీలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నా. కొత్త అనుభూతి వచ్చింది. ముందుగా కొంత ఆందోళన కలిగింది. కానీ అధికారులు ఓటు ఎలా వేయాలో స్పష్టంగా వివరించారు. – యార్లగడ్డ అజయ్, ఆదర్శనగర్, మంచిర్యాల

'కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం'

- బెల్లంపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్

బెల్లంపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర మాజీ మంత్రి, బెల్లంపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నట్లు స్పష్టమవుతోందన్నారు. రాష్ట్రంలో చీకటి రాజ్యం పోయి ఇందిరమ్మ రాజ్యం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గెలుపును జీర్ణించుకోలేక బీఆర్‌ఎస్ శ్రేణులు అక్కడక్కడ దుందుడుకు చర్యలకు పాల్పడ్డారని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ చర్యలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారన్నారు. ఈ నెల 3న ఎన్నికల ఫలితాలు రాగానే అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి కోసం రోడ్ మ్యాప్ ప్రకటిస్తానన్నారు. బెల్లంపల్లి సమగ్రాభివృద్ధికి పాటుపడతానన్నారు. 35 రోజుల పాటు కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి పని చేశారని, వారి శ్రమ వృథా కాబోదని, విజయానికి నాంది అవుతుందన్నారు. సమావేశంలో నాయకులు ప్రతాప్, మల్లయ్య, రాము నాయక్, మనోహర్, నాతరి స్వామి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వినోద్

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిపై ఫిర్యాదు!

మంచిర్యాలక్రైం: ఎన్నికల కోడ్ ఉల్లంఘించాడని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావ్‌పై స్వతంత్ర అభ్యర్థి నయాంపాషా ఎన్నికల అబ్జర్వర్ బిశ్వజిత్ దత్తాకు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 15 మందితో కలిసి స్థానిక 190, 191 పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి ప్రచారం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రచారం వీడియోతో పాటు సీఈసీ, ఈసీఐ, సీఈవో, కలెక్టర్, ఆర్డీవో, రామగుండం సీపీ, డీసీపీ, ఏసీపీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన పరిశీలన అధికారి మారుతి ప్రసాద్‌ను వివరణ కోరగా తదుపరి విచారణ నిమిత్తం స్థానిక పోలీస్ అధికారులకు రాసినట్లు తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించక పోవడం గమనార్హం.